అజ్ఞానాంధకారంలో
చేసిన ఘోరం
అతణ్ణెలావెంటాడింది?

# ప్రాయశ్చిత్తం

పసుపులేటి
రాధాకుమారి
కథ

'మనిషి జీవితంలో దుఃఖం ఓ మబ్బు తెర'

'అదే లేకుంటే సౌఖ్యంలోని మాధుర్యం తెలీదేమో!

...


'రోజులు ముసలి ఎద్దు నడకలా భారంగా గడుస్తున్నాయి!... ఏ వయసుకు ఆ నడక అలవడుతుంది కాబోలు... ప్చ్! ఈ వృద్ధాప్యంలో ఇంకెన్ని గడ్డురోజులను ఎదుర్కోవాలో?'

అంటుండగా స్తంభానికి ఆనుకుని కళ్ళు మూసుకున్నారు పరమేశ్వరశాస్త్రి.

చూడగానే నమస్కరించాలన్పించే గంభీర విగ్రహం. గుళ్ళో ప్రతిరాత్రీ ఆయన గ్రంథపఠనం చేస్తుంటే తన్మయులైపోయేవారు జనం... ఇంటికెళ్ళినా... ఏనాటి ఎవరికి తెలియవచ్చినట్లు శంఖారావంలా పద్యాలు మధురంగా వినిపిస్తుండాయన కంఠస్వరం... ఇదంతా గతంలో. ఇప్పుడు...

పాండిత్య ప్రతిభతో ప్రశాంతంగా వెలిగే ఆయన వదనం ఆకులు రాలిన చెట్టులా బోసిపోయింది. ముఖంలోని వింత తేజస్సు మసకన మరిగిపోయింది. ఓ తెల్ల పింజలా మారిపోయింది శిరం... ఎప్పుడూ ఏవో గ్రంథాలో... గుళ్ళోనో కూర్చుని నిశ్చింతంగా మౌనంతో దిగులుగా ఉంటున్నారు... ఏ కారణం ఆయనను ఈ మనస్తాపానికి గురిచేసిందో ఇంతవరకు ఎవరికీ తెలీలేదు... ప్రసవవేదన పడుతున్న స్త్రీలా ఉండే ఆయనను పలకరించాలంటే జంకు— భయం...

'ఊళ్ళోని అందరికీ ఆయనో ప్రశ్నగా



మిగిలిపోయారు.'

"ఇంకా ఇంటికి వెళ్ళలేదా పరమేశా?"

గుడిలోనుంచి బయటికి వస్తూ అడిగాడు శ్రీనివాసాచార్యులు. ఆ గుడికి పూజారి పరమేశ్వరశాస్త్రికి బాల్య మిత్రులు.

మండపంలో నుంచి లేచారు పరమేశ్వర శాస్త్రి. ఇద్దరూ కలిసి ఇంటికి బయలుదేరారు.

"ఈ పూట ఆరోగ్యం ఎలా ఉందిరా?. .."

"యధాతథం... జబ్బు చేస్తే కోలుకొని తిరిగేయగల వయసా ఇది?... ఇక రోజులు లెక్క పెట్టుకోవడమే చెయ్యగలిగింది" నిస్పృహ నిండిన కంఠంతో అన్నారు శాస్త్రిగారు.

"అలా అనుకుంటే ఎలా పరమేశా? మన ప్రయత్నం మనం చెయ్యాలి... తర్వాత భగవంతుని దయ"

మిత్రునివైపు బాధగా చూస్తూ అన్నారు చారిగారు.

"ఈ రోగం మందూ మాకులతో మానేది కాదులే... బతికున్నంత కాలం పీడిస్తూనే వుంటుంది. 'వివాశకాలే విపరీత బుద్ధి'ని చేసుకున్నవాడికి చేసుకున్నంత... తలరాతను ఎవరు తప్పించగలరూ?"

శాస్త్రిగారి గొంతువిండా వైరాగ్యం ఆక్రమించింది.

ఏటి ప్రక్కన నడుస్తున్నారు ఇద్దరూ...

వెన్నెల రాత్రులు కాబోలు... గుబురు చెట్ల కొమ్మల సందులనుంచి వెన్నెల ధారగా పడుతోంది... ఎండుటాకులు రాలుతూ... మధ్య మధ్యలో కొమ్మల మీద పిచ్చుకలతో, వాటి కువకువ రాగాలతో ఆహ్లాదంగా వుంది వాతావరణం— ఇంతటి ప్రశాంతతలోనూ ఇద్దరి హృదయాలు పేదతీరలేక పోతున్నాయి .. దారికి అడ్డుగావున్న ముళ్ళ కంపను తీసి దూరంగా విసిరి అడిగారు చారి.

"శివ వచ్చాడా!"

"ఊహూ!... ఎక్కడుంటున్నాడో— ఏమి తింటున్నాడో వాడికే తెలియాలి. ఇంటిమీద గాలి మళ్ళితే వస్తాడు అంతే... వాడికోసం తండ్రి ఎంత తల్లడిల్లిపోయేది వాడికి తెలిస్తే కదా... వాడేమిటో వాడి ధ్యాసేమిటో." కొడుకు రూపం కళ్ళముందు మెదలగానే కళ్లలో నీళ్ళు మెదిలాయి శాస్త్రిగారికి,

"నిజమేరా... శారీరకంగా, మానసికంగా మనశ్శాంతిలేక నువ్వు బాధపడుతుంటే వాడేమో చెట్లమ్మట, గుట్టలెమ్మట పిచ్చిగా తిరుగుతున్నాడు... విధి విచిత్రం చూడు. ... 'పండిత పుత్రః పరమశుంఠని'— సామెత, కానీ— అన్ని శాస్త్రాలు అభ్యసించి కూడా వీడు ఎందుకూ పనికిరాకుండా పోయాడు— వీడు జీవితంలో బాగుపడే యోగం లేనట్టుంది." ఆవేదనగా అన్నారు చారిగారు...

శివరామశాస్త్రి ప్రస్తావన ఇద్దరి మనసులనూ భారం చేసింది.

ఏటిపైనుంచి వచ్చే చల్లగాలి— ఇద్దరి మధ్య ఉన్న అశాంతికి వేడిగా మరలిపోతోంది...

"ఇలాంటి రోజులను ఎదుర్కోవలసి వస్తోందని కలలోకూడా అనుకోలేదు శ్రీనివాసా! బిడ్డను కని తల్లిపోయినా... ముత్యంలా ఉన్న కొడుకును చూసుకొని 'పున్నామ నరకం' నుంచి విముక్తి లభించిందని పొంగిపోయాను... సమర్థుడనుకున్న కొడుకు ఉండి కూడా అప్రయోజకుడయ్యాడు. ... వాడి కంటూ ఓ వ్యక్తిత్వాన్నిచ్చి... పరమేశ్వరశాస్త్రి కొడుకుగా కాక— శివరామశాస్త్రి తండ్రిగా గుర్తింపు పొందాలని ఆశపడ్డాను. ఆశలు పెంచుకోవటం దేవుడికి కూడా నచ్చదేమో

? ఆశలన్నిటినీ వెలితిలో నింపి... నిరాశలను పేర్చేశాడు.

ఆ మతిలేని మనిషిని చూస్తూ... ఇంకెన్ని రోజులు జీవచ్ఛవంలా బ్రతకాలో?' ' మోయలేని వ్యథతో బరువుగా అన్నారు శాస్త్రిగారు.

"ఏం చేస్తాం చెప్పు! భగవంతుడు వాడిపట్ల నిర్దయగా చూశాడు. వాడి రాత అలా వుంది... నువ్వు అనవసరంగా ఆలోచిస్తూ మనస్సుపాడుచేసుకోకు. ఓపిగ్గా మంచి రోజులకోసం ఎదురుచూడు."

* * *

ఎదురుగా గుమ్మంలో నుంచున్న కొడుకును చూడగానే... సంతోషంగా ఎదురెళ్ళి చేయిపట్టుకుని ఇంట్లోకి తీసుకొచ్చారు పరమేశ్వరశాస్త్రి.

మంచంపైన కూర్చోబెట్టి తనూ ప్రక్కనే కూర్చుంటూ—

"ఎక్కడికెళ్ళావురా శివా? రెండు రోజులుగా కన్పించలేదు. నువ్వు కన్పించకపోవటంతో నేనెంత కృంగిపోయానో తెల్సా? నా బాధ నీకర్థం కాదు... అర్థం చేసుకోలేవ్— ఏ క్షణంలో ఎక్కడుంటావో నీకే తెలీదు. నువ్వు ఎక్కడుంటావని వెతకను— ఇప్పటికైనా నువ్వు వచ్చావ్. అంతే చాలు— ఆకలవుతోందా?"

ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకుంటూ అడిగారు శాస్త్రి.

మాట్లాడలేదు శివరామశాస్త్రి. తలవంచుకుని కూర్చుని ఉన్నాడు.

నా పిచ్చిగానీ వీణ్ణి అగడమేమిటి... నిట్టూర్చి—

వంటింట్లోకి వెళ్ళి పళ్ళెంలో అన్నం తీసుకొచ్చారు. శివ ప్రక్కనే కూర్చుని అన్నం కలిపి నోటి దగ్గర పెట్టారు. ఆ చేతిని విసురుగా ప్రక్కకు తోశాడు శివ... త్రోసి తండ్రిని దూరంగా నెట్టాడు...

దబ్బున క్రిందపడి బాధగా మూలిగారు శాస్త్రి...

శివ ఇంటికొచ్చినప్పుడల్లా శాస్త్రిగారికి

## అంధులకో మరమనిషి



అభివృద్ధి చెందిన దేశాలలో కుక్కల్ని పెంచుకోవటం ఒక హాబీ! పిల్లలు 15 సంవత్సరాలు రాగానే విడిగా వెళ్ళిపోయి వుండటంతో భార్యాభర్తలకు కుక్కలే కాలక్షేపం. అయితే బ్రిటన్‌లో అంధులకు సహాయంగా వుండడానికి కుక్కల్ని పెంచుకుంటారు! ఈ విషయంలో కొన్ని అభిప్రాయభేదాలు రావటంతో చాలావరకు ఈ పద్ధతిని ఆపివేశారు! ఇలాంటి పరిస్థితిలో జపాన్‌కు చెందిన ప్రొఫెసర్ కాటో ఇంట్లో పనులకూ, అంధులకూ ఉపయోగపడేలా... ఓ మరమనిషిని తయారుచేశాడు! ఇకనుంచి అంధులకు సరైన దిక్కు... ఈ మరమనిషి అవడం ఖాయం!

—బాపిటర్

ఇలాంటి శారీరక బాధ తప్పదు... ఆవేదనా భరితంగా ఉన్న చూపులతో శివవైపు చూశారు శాస్త్రి...

బాధను దిగ్రమింగి నెమ్మదిగా లేచి దగ్గరకొచ్చారు...

అప్పటికే అన్నం పళ్ళెం చేత్తో పట్టుకున్న శివ— తండ్రి దగ్గరకు రాగానే అన్నం ముఖానికి చల్లి 'అయి్' అని అరుస్తూ పళ్ళాన్ని తండ్రి ముఖానికేసి అదిమాడు...

నిర్ఘాంతపోయి విడిపించుకోబోయారు శాస్త్రిగారు— వీలుకాలేదు. పిచ్చి బలంతో ఉన్మాదంగా తనపైన పడుతున్న కొడుకును భయంగా చూశారు. వెర్రిగా తండ్రిని చూచి గట్టిగా నవ్వసాగాడు శివరామశాస్త్రి ...

నవ్వి నవ్వి... చివరకు ఏడుస్తూ— శాస్త్రిగారిని విదిలించి దూరంగా నెట్టి ఏడుస్తూనే బయటికి పరుగెత్తాడు.

...

నోట మాటరాక పడున్న శాస్త్రిగారు నెమ్మదిగా ఊపిరి పీల్చుకున్నారు.

స్థిమితపడి మంచం కోడు పట్టుకుని పైకి లేవబోయారు... కలుక్కుమంది వెన్నెముక.

'అబ్బా!... ఈశ్వరా...''

మంచం కోడుకు తల కొట్టుకుంటూ—

'ఈశ్వరా! ఇంకా ఎందుకయ్యా కాలయాపన చేస్తున్నావ్... పిచ్చెక్కిన తనయుని చూస్తూ ఈ నరకం నాకొద్దు... ఈదుర్భరవ న భరించటం అసాధ్యమవుతోంది... త్వరగా ఈ దీపాన్ని ఆర్పెయి్ ...' వర్షిస్తున్న హృదయంతో రోదిస్తూ అలాగే నేలమీద వాలిపోయారు శాస్త్రిగారు.

* * *

చెట్లచాటుగా వస్తున్న ఆ 'నీడ' మంచం దగ్గర కొచ్చి ఆగిపోయింది.

మంచంలో పరమేశ్వర శాస్త్రి నిద్రపోతున్నాడు.

ఆ 'నీడ' వంగి తన చేతులను శాస్త్రిగారి మెడపైన వేసి నొక్కటం మొదలెట్టింది. నిద్రలోవున్న శాస్త్రిగారు కదలబోయారు— ఆ చేతులు తన పట్టును మరింత బిగించాయి— సగం మెలుకువ వచ్చిన శాస్త్రికి అరవటానికి గొంతు పెగల్లేదు. శరీరంలోని సత్తువంతా ఎవరో పీల్చేసినట్లు... నరాలన్నీ నిస్త్రాణంగా వేలాడుతున్నాయి్ ... మెడలోని నరాలు బిగుసుకుపోతుంటే...

'అమ్మా' గట్టిగా అరిచి మంచంలోనుంచి కిందపడ్డారు పరమేశ్వరశాస్త్రి.

పూర్తిగా మెలుకువ వచ్చింది... ఊపిరి గబగబా పీలుస్తూ— మెడ సవరించుకుని ఆరాటంగా చుట్టూ పరికించి చూశారు... ప్రశాంతంగావుంది ఆరు బయలంతా—

'హు... ఇది తనను వెంటాడక మానదు. రెండునెలలనుంచి ప్రతిరాత్రీ ఇదే 'కల'. ఆ చేతులకు ఎర్రటి గాజులు మెరుస్తున్నాయి్ . తెల్లటి జంట సర్పాల్లా తన మెడను చుట్టుకుపోతూ...

భగవంతుడా—

విచక్షణా జ్ఞానం మరచి నాలోని మంచి నశించిన వేళ... హృదయంలో చెలరేగిన పెనుతుఫాను తాకిడికి... ఓ బలహీనమైన క్షణంలో నాద్వారా క్షమించరాని ఘోరం

జరిగిపోయింది— శాస్త్రాలు, గ్రంథాలు ఏవీ నన్ను ఆపలేక పోయాయి. క్షణికావేశంలో మూర్ఖుడిలా ప్రవర్తించాను— అన్నీ తెలిసి చూస్తున్న నువ్వైనా నా తొందరపాటుకు అడ్డు వెయ్యలేదు... అప్పుడే—

'ఓరి అజ్ఞాని! మహా పాపానికి పూనుకుంటున్నావ్? దుష్కర్మలు చుట్టుకుని చస్తావ్‌రా!' అని, నిలదీసి నా చెంపలు వాయించుంటే నాకీ బాధ ఉండకపోను— చేసిన పాపం చెప్పినా పోదు— ఆ పాపం రాత్రిళ్ళు నిద్రను దూరంచేసి హింసిస్తోంది. రోజుకోలా కన్పించి తన ప్రతీకారం తీర్చుకుంటోంది. క్రితం రాత్రి ఇలాగే...

...ఎవరో మీద పడ్డట్టు వళ్ళంతా కుదించుకుపోతోంది... ఆశ్చర్యంగా తోసెయ్యబోతే చేతులకు మనిషి శరీరం తగల్లేదు. చేతులు వట్టిగా గాలిలో తేలుతున్నాయి— అది మోస్తున్నట్లు తన శరీరం మంచంలో దిగబడిపోతోంది— స్పర్శ తెలుస్తోంది. కానీ శరీరం కన్పించటంలేదు... కళ్ళు పెద్దవిచేసి చూశారు. చీకటి తప్ప ఏమీ కన్పించటంలేదు.

తనను ఆలింగనం చేసుకుంటున్న ఆకారం— ఏమైవుంటుంది. మనిషా? జంతువా? కాదు— కాదు... అది—

మృత్యువా?

...???


మొదటిసారిగా భయం కల్గించింది ఆ ఊహ!

'ఊహ కాదు నిజం'

'మృత్యువులోంచి విముక్తి లేదు'— తప్పదు... తప్పేలా లేదు... ప్రాణ మిత్రుని కూడా చెప్పని, చెప్పలేని ఈ బడబాగ్నిని ఇకదాచి ప్రయోజనం లేదు. ఇన్ని రోజులు తనలో పేరుకుపోయిన జడ్యాన్ని చెబితేగాని శాంతి లేదు మనసుకు... అనుకున్న వెంటనే స్థిరంగా లేచి నడవసాగాడు పరమేశ్వరశాస్త్రి.

* * *

స్వచ్ఛమైన మల్లెపూవ్వులా వుండి— ముఖంలో వింతవెలుగుతో సంస్కారం ఉట్టి



పడెది...

పెద్దలపల్లు ఎంత వినయం... ఎంత గౌరవం...

విరునవ్వు వీడని పెదవులు... ఏవీ— ఇప్పుడవన్నీ ఏవీ?—

ఏ క్షుద్రాస్త్రానికి తుడిచిపెట్టుకుపోయాయి?

ఏ క్షుద్రశక్తీ కాదు— తనే కారకుడు... అవును తనే.

వాడలా పిచ్చి కుక్కలా తిరగటానికి పూర్తిగా తనే బాధ్యుడు— బాధగా కణతలు రుద్దుకున్నారు శాస్త్రిగారు.

ఆయన మూపు మెడలోని రుద్రాక్షమాల పైన పడింది— ఆ రుద్రాక్షమాల నిప్పుల చక్రంలా మెడచుట్టూ కాల్చేస్తున్న అనుభూతి... ఈ మాల ధరించే అర్హత నీకు లేదు అని చెపుతూ—

శ్రీనివాసాచార్యుల ఇంటిముందు ఆగారు. చారిగారు నిద్రపోవటంలేదు. వసారాలో దీపం పెట్టుకుని 'భగవద్గీత' చదువుతున్నారు.

'శ్రీనివాసా' మెట్ల దగ్గరనుంచే పిలిచారు.

తలత్రిప్పి చూచి... ఆశ్చర్యంగా లేచి వచ్చారు శ్రీనివాసాచార్యులు.

"ఏమిటి పరమేశ ఇలా వచ్చావ్? ఏమైంది" ఆదుర్దాగా అడిగారు.

"ఏం లేదు... గుడికెళ్దాం పద"

"గుడికి... ఇప్పుడా?"

"అవును"

"ఇంతరాత్రి వేళ"

"పనుంది"

ముందుకు నడిచారు శాస్త్రి. మౌనంగా అనుసరించారు శ్రీనివాసాచార్యులు.

* * *

గుడిమెట్ల మీద కూర్చున్నారు.

... ...

కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు—

ఆలస్యం భరించలేక ఆత్రంగా అడిగారు చారిగారు.

"విషయమేమిటి"

శ్రీనివాసా! ఇన్నేళ్ళకు నీ దగ్గర ఓ నిప్పులాంటి నిజాన్ని దాచవలసి వచ్చింది. ఆగి—

చారిని చూశారు. మసక చీకటిలో చారిగారి ముఖంలో ఏ భావం వ్యక్తం కాలేదు. మౌనంగా చూస్తున్నారు శ్రీనివాసాచార్యులు.

...చారి, చిన్ననాటినుంచి ఇద్దరం కలిసి, మెలిసి బ్రతికాం— కానీ ఇప్పుడు మనమధ్య తెర నిల్చినట్లుంది— నిన్ను వేరుచేసి స్వార్థంగా ఆలోచించి అనూహ్యమైన పరిస్థితిలో చిక్కుకుపోయాను.... మన మధ్య రక్తపాశం లేకున్నా ... రుణానుబంధం— మైత్రి ఉన్నాయి. నన్ను అర్థం చేసుకోగలిగింది నువ్వే— నే చెప్పింది విని అసహ్యించుకో, కానీ జాలి చూపకు నేను భరించలేను—

ఆ రోజు శివరామశాస్త్రి ఎవరికీ తెలియకుండా పెళ్ళి చేసుకొని వచ్చాడు...

"జ్ఞాపకం వుందా నీకు..."

తల ఊపారు శ్రీనివాసాచార్యులు.

'ఆ సమయంలో...'

* * *

ఆ రోజు శివరామశాస్త్రి 'నారయ్య విధవ కూతుర్ని' పెళ్ళి చేసుకొని ఇంటికి తీసుకొ

చ్చాడు.

ఎదురుగా పూల దండలతో వున్న వారిని చూసి నిశ్చేష్టుడనయ్యాను.

'కళ్ళముందు నిజం' చేదుగా... జీర్ణిం చుకోలేక పోయాను.

వంశ ప్రతిష్ఠను. ఆచారపట్టింపునూ ధిక్కరించి— శివ ఇంత దిగజారిపోతాడనుకోలేదు... వీడి చేసిన నికృష్టపు పనికి వంశం అంతా మైలపడింది. ఆచారాలన్నీ పాప పంకిలమవ్వబోతున్నాయి ...' అనంత తీర్థాల్లో మునిగినా ఈ శని పోతుందా...

'ఏడు జన్మలెత్తినా ఈ పీడ వదలదు...'

మెల్లగా ఆవేశం రాజుకుంది. కంపరంగా వాళ్ళ ముఖంమీద తలుపులు వేసేశాను.

శివమీద కోపంతో దహించుకుపోసాగింది మనస్సు...

ఈ వేద పండితునిగా, నియమనిష్ఠలతో పరువుగా బ్రతికే నేను— రేపు జనానికి నా ముఖమెలా చూపను... ఆలోచించే కొద్దీ ఆవేశం పడగ విప్పుతోంది.


... ఆలోచిస్తూనే అర్ధరాత్రి తలుపు తెరిచి చూచిన నాకు... శివపక్కనే ఆ పిల్ల— వసారాలో నిద్రపోతున్నారు... అన్నింటికీ కారణం ఈ 'పిల్లే' అనుకున్నా... ఏవగింపు కలిగింది ఆ పిల్లంటే... అంతవరకు బిగపట్టిన ఆగ్రహం ఉగ్రంగా మారింది... ఇక ఏమీ జ్ఞాపకం లేదు...

'రేపు ఊళ్ళో నాకు జరగబోయే అవమానం భయంకరంగా కన్పిస్తోంది'

చెపుతున్న శాస్త్రిగారు ఆగారు— ఆగి అంగవస్త్రంతో కళ్ళు తుడుచుకున్నారు. నిర్వికారంగా వింటున్నారు చారి.

...బలహీనమైన ఆ రాత్రి ఇద్దరి జీవితాలనే మార్చేస్తుందని తెలిస్తే... ఆ రాత్రిని కళ్ళు మూసుకుని ఆపేవాణ్ణి... కానీ! చేయి దాటిపోయింది— సమయం మించిపోయింది

మీరంతా అనుకున్నట్లు... నేను ఇంట్లోకి రానివ్వకపోతే అభిమానంతో ఆ పిల్ల ఆత్మహత్య చేసుకోలేదు... అది హత్యే...



## ఆశయం

ఓనమాలురాని విద్యాశాఖామంత్రి ఎంకయ్యను విలేకరులు ఆసక్తిగా అడిగారు. "మీ ఆశయం ఏమిటి?"

"అమెరికా ప్రెసిడెంట్ పదవిలో కూసోవాలని..."

"ఆ..."

—పి.సునీత (వడ్లమూరు)

అవునురా చారి— ఆపిల్లను స్వయంగా నా చేతులతో బావిలోకి త్రోసి చంపాను...

ఆ క్షణంలో నా పెద్దరికం... ఊళ్ళో నా పరపతి ఏదీ గుర్తు రాలేదు. దుష్టశక్తి ఆవహించినట్లు అన్నీ మర్చి—

'నా వంశానికే పెద్ద మచ్చ కాబోయిన ఆ పిల్లను ప్రాణాలతో ఉంచకూడదు అనుకున్నా— దగ్గరకెళ్ళి అరవకుండా నోట్లో అంగవస్త్రం కుక్కి ఎత్తుకెళ్ళి బావిలో పడేశాను. బావిలో నీళ్ళ కదలిక ఆగేదాక వుండి అప్పుడు ఇంట్లోకి నడిచాను— అప్పుడు మనస్సు శాంతించింది.

అయితే— మరుసటి రోజు... చనిపోయిన భార్యను చూచి శివ గుండెలు పగిలేలా ఏడుస్తుంటే నేను చేసింది తప్పేమో అన్పించింది. మరుక్షణం అహంకారంతో మళ్ళీ రాయిలా ఉండిపోయాను....

భార్య మరణంతో పిచ్చివాడయిన శివను చూస్తుంటే నేను చేసింది ఎంత ఘోరపాపమో ఇప్పుడు అర్థమైంది... ఆ భీతే నన్ను రోజూ వెంటాడి భయపెడుతోంది.... 'నేను చస్తే కానీ ఆ పిల్ల ఆత్మకు శాంతి లేదు. శాంతించదుకూడా— ఏ క్షణంలో మృత్యువు కబళిస్తుందోనని అడగట్టుకపోతున్నా... ఇక భయం లేదు. నిజాన్ని నీ ముందుంచాను. నిశ్చింతగా వుంది నా మనస్సు... ఇప్పుడు చెప్పు ఇంకా నాపై ప్రేమ... అభిమానం ఉన్నాయా?

అసహ్యమేస్తుందా... జాలేస్తుందా...???

చాలా రోజుల తర్వాత ఎక్కువగా మాట్లాడటంవల్లా— ఉద్రేకంగా చెప్పటంవల్లా ఆయాసంతో రొప్పుతున్నారు పరమేశ్వర శాస్త్రి.

శ్రీనివాసాచార్యులు పెదవి విప్పలేదు. భావరహితంగా మసగ్గా కన్పిస్తున్నా మిత్రుణ్ణి తదేకంగా చూశారు...

'పిచ్చి పరమేశ్వర శాస్త్రీ! ఎంత అజ్ఞానివిరా?...

వసారాలో నిల్చుని నిస్సహాయంగా నువ్వు చేసింది శివ చూశాడని నీ ఊహక్కూడా అంది ఉండదు— వాడి మనస్సు పగిలింది. గుండె రగిలి— వాడి గుండె మంటలు జ్వాలలై నిజాన్ని బయటకు చెప్పి పరువూ ప్రతిష్ఠలంటూ బ్రతుకుతున్న తండ్రిని నగుబాటు చెయ్యలేక... మనస్సుపడి చేసుకున్న భార్య మరణం— చివరికి వాణ్ణి పిచ్చివాణ్ణి చేశాయి. గుళ్ళో నా దగ్గర వాడు ఏదేదో వాగుతున్నాడని మందలించాను. కానీ! అదే నిజమన్నమాట... అలాంటి పరిస్థితిలో కూడా కొడుకుగా నీ పరువు నిలబెట్టాడు. నువ్వు మాత్రం స్వార్థంతో— ఇప్పుడు చేసింది తప్పని పశ్చాత్తాపపడుతున్నావు— అదే నీకు స్వర్గానికో, నరకానికో దారి చూపుతుంది... ఎన్ని పుణ్యాలు చేసినా ఒక్క పాపంతో సరి... స్వయం కృతం— మిత్రునిగా నేను క్షమించినా నిజం రః జనానికి తెలిస్తే క్షమించరు... నమస్కరించిన చేతులే వేలెత్తి చూపుతాయి... నిజాన్ని నా పెదవి దాటనివ్వను. నిట్టూర్చి— శాస్త్రి వైపు చూచిన చారిగారు గట్టిగా అరిచారు...

'పరమేశా'... కాలు జారినట్లుంది. దొర్లిపోయి చివరి మెట్టుమీద పడున్నారు శాస్త్రిగారు... గబగబా క్రిందికి వెళ్ళి చెయ్యి

పట్టుకున్నారు లేపడానికి... వళ్ళంతా చల్లగా తగిలింది... వాడి పట్టుకొని చూచి బరువుగా నిట్టూర్చారు చారి. 'కొండంత పాపంలో గోరంత పుణ్యం' ఇదే కాబోలు— అదృష్టవంతుడు భగవంతుని సన్నిధిలో తుది శ్వాస వదిలాడు.

ఏటి గట్టున చితి మంటల్లో పరమేశ్వర శాస్త్రి నిర్జీవ కట్టె కాల్తోంది. ఎర్రటి మంటల్లోనుంచి నల్లని పొగ నింగివైపు సాగిపోతోంది.... చితికి కాస్త దూరంగా నిల్చున్న శివరామశాస్త్రిని చూశారు శ్రీనివాసాచార్యులు— ప్చ్ ఎలాంటి పిల్లాడు ఎలా అయిపోయాడు, ఆర్ద్రతగా అనుకున్నారు— మంటలు తగ్గుముఖం పట్టాయి — శివ దగ్గరకు నడిచి 'శివా! పద నాయనా మన ఇంటికి' భుజంపైన చేయివేసి నడిపిస్తూ ముందుకు కదిలారు శ్రీనివాసాచార్యులు.

*

# తినండి...ఒళ్లు తగ్గించుకోండి



ఏమీ తినకుండా ఒక పొద్దు, లేదా రోజంతా ఉపవాసమో చేస్తే ఒళ్ళు తగ్గిపోతుందని చాలామంది ఆడవాళ్ళు భావిస్తూ వుంటారు. అలా చెయ్యవద్దు. శుభ్రంగా తినండి. కానీ తినేవన్నీ కొవ్వులేనివో, కొవ్వు బాగా తక్కువగా వుండేవో అయితే చాలు అంటున్నారు రీసెర్చి చేసిన విదేశీ డాక్టర్లు. కొవ్వు పదార్థం తక్కువ మోతాదులో ఉండే స్వీట్లు, అయిస్ క్రీమ్‌లు కూడా తినొచ్చుట. చాలామంది బాగా డైటింగ్ చేస్తారు. కొవ్వున్న పదార్థాలనే తింటారు. ఆ విధంగా చేస్తేనే బరువు పెరుగుతుందని వీరి భావన. అదీకాక తక్కువగా కొవ్వు పదార్థాలుండేవాటిని తింటే ఇటు వళ్ళు రాదు, అంటూ కొవ్వుబాగా వుండేవాటిని తినలేదే అన్న ఆలోచనా రాదు అని రీసెర్చి చేసిన డాక్టర్లు గట్టిగా చెప్తున్నారు.

—గురజాడ శోభా పేరిందేవి